నమస్తే తెలంగాణ

జిందగీ

ఆదివారం | 2 మార్చి 2025
హైదరాబాద్ | www.ntnews.com

ఫొటోలు వద్దు ప్లీజ్

తమ సెలెబ్రిటీ హోదా పిల్లల స్వేచ్ఛకు అడ్డు కావొద్దని భావిస్తున్నారు బాలీవుడ్ కపుల్స్. బిడ్డల ప్రైవసీని కాపాడటం తమ బాధ్యతగా భావిస్తున్నారు. ఇటీవల తమ పిల్లల ఫొటోలు తీయొద్దని సైఫ్, కరీనా జంట ఫొటోగ్రాఫర్లను, అభిమానులను కోరింది. ఈ జాబితాలో రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ కూడా చేరారు. ఈ దంపతుల గారాలపట్టి రాహ కపూర్ చిత్తరువులు కొన్నాళ్లుగా నెట్టింట వైరల్‌గా మారుతున్నాయి. ఓ ఫ్యామిలీ ఈవెంట్‌లో మొదటిసారి తన కూతురిని ప్రపంచానికి పరిచయం చేశారు ఆలియా, రణ్‌బీర్. ఇక అప్పట్నుంచి ఆ చిన్నారి ఫొటోలు నెట్‌లో చక్కర్లు కొడుతున్నాయి. పైగా తమ ముద్దులపట్టి అల్లరి పనులను క్లిక్ మనిపించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసేది ఆలియా. దీనివల్ల తమ కూతురి ప్రైవసీ దెబ్బతింటుందని భావించిన ఆమె.. గతంలో పోస్ట్ చేసిన ఫొటోలన్నీ డిలిట్ చేసింది. అంతేకాదు, ఎక్కడైనా తాము కనిపిస్తే.. తమ బిడ్డను ఫొటో తీయొద్దని ఫొటోగ్రాఫర్లకు విజ్ఞప్తి చేసింది. అభిమానులను సైతం ఇదే అభ్యర్థించింది. ఇటీవల సైఫ్‌పై దాడి తర్వాత మీడియా కండ్లన్నీ కరీనా, సైఫ్ దంపతుల కొడుకులు తైమూర్, జహంగీర్‌లపై పడ్డాయి. వారి ఫొటోలు ఇంటర్నెట్‌లో విపరీతంగా చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో తమ బిడ్డల ప్రైవసీకి భంగం వాటిల్లనివ్వొద్దంటూ సైఫ్, కరీనా మీడియాను కోరారు. తాజాగా ఆలియా, రణ్‌బీర్ కూడా ఇదే సూత్రాన్ని ఫాలో అవుతున్నారు.

ఆ పాట.. పాడకుండా ఉండాల్సింది!

వేల పాటలు పాడిన శ్రేయా ఘోషల్.. ఒక్క పాట విషయంలో మాత్రం బాధపడుతున్నది. 'ఆ పాట పాడకుండా ఉండాల్సింది!' అంటూ తెగ ఫీల్ అవుతున్నది. హిందీలోనే కాకుండా.. అన్ని దక్షిణాది భాషల్లోనూ ఎన్నో పాపులర్ పాటలు పాడింది శ్రేయా ఘోషల్. భాషతో సంబంధం లేకుండా లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్నది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'ఐటమ్ సాంగ్స్'పై స్పందించింది. అగ్నిపథ్ చిత్రంలో 'చికిని చమేలీ' పాట పాడినందుకు బాధపడుతున్నట్టు వెల్లడించింది. ఈ పాట అర్థం తెలియకుండానే చిన్నపిల్లలు కూడా పాడుతూ ఎంజాయ్ చేస్తున్నారనీ, అది ఎంతమాత్రం కరెక్ట్ కాదనీ అంటున్నది. ఇలాంటి పాటలు మగవాళ్లే రాస్తారనీ, అందుకే అందులో ఆడవాళ్లను కించపరిచే పదాలు ఎక్కువగా ఉంటాయని శ్రేయా ఘోషల్ చెప్పుకొచ్చింది. ఆడవాళ్లు కూడా పాటలు రాస్తే.. ఇలాంటి పదాలకు బ్రేక్ పడే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. ఇంకా మాట్లాడుతూ.. ''శృంగారం, అసభ్యత మధ్య ఒక సన్నని గీత ఉంటుంది. ఆ విషయం నాకు తెలుసు. కానీ, కొన్ని పాటల్లో పూర్తి సారాంశం తెలియకుండానే.. చిన్నారులు ఆ పాటలు పాడుతున్నారు. వాటిని మామూలు పాటల్లాగే భావిస్తున్నారు. డ్యాన్స్ కూడా చేస్తున్నారు. ఇలాంటివి చూసిన తర్వాత.. ఐటమ్ సాంగ్స్ ఎంపికలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నా!'' అంటూ చెప్పుకొచ్చింది. వివిధ సందర్భాల్లో శ్రేయను కలిసిన చిన్నారులు.. తన పాటలంటే ఇష్టమనీ, తన ముందు పాడాలని ఉందంటూ.. ఐటమ్ సాంగ్సే ఎక్కువగా పాడుతున్నారట. ఇలాగే ఒకసారి ఓ ఐదేళ్ల పాప శ్రేయను కలిసి 'చికినీ చమేలీ' పాట పాడిందట. ''అంత చిన్న అమ్మాయి అలాంటి పాట పాడటం నాకు ఏమాత్రం మంచిగా అనిపించలేదు. ఇలాంటి సంఘటనలు ఎన్నో ఎదురయ్యాయి!'' అంటూ వెల్లడించింది శ్రేయ. ఇక 2012లో వచ్చిన 'అగ్నిపథ్' సినిమా కోసం 'చికినీ చమేలీ' పాట పాడింది శ్రేయ. ఆమె గాత్రానికి.. స్టార్ హీరోయిన్ కత్రినా స్టెప్పులు తోడవ్వడంతో సూపర్ హిట్‌గా నిలిచింది. 12ఏళ్లకే పాటలు పాడటం ప్రారంభించిన శ్రేయ.. దేశంలోని స్టార్ సింగర్లలో ఒకరిగా రాణిస్తున్నది.

'తొంగి తొంగి..
నక్కి నక్కి గాదే..
తొక్కుకుంటూ పోవాలే' అని
'ఆర్ఆర్ఆర్'లో ఎన్టీయార్ తెలంగాణ భాషలో
రౌద్రం ప్రదర్శించాడు. 'పెండ్లాం మాట మొగుడింటే
ఎట్టుంటదో పపంచకానికి చూపిస్త !!' అని పుష్పలో సీమ మాటల్తో
అల్లు అర్జున్ సీను పండించాడు.'ఇప్పుడు ఏటంటావే.. బుజ్జితల్లీ!!' అని 'తండేల్'లో
నాగచైతన్య.. సిక్కోలు యాసలో సిత్రం చేశాడు. ఇప్పుడు మన హీరోలు.. కథతోపాటు
మాటలకూ, యాసకూ పట్టం కడుతున్నారు. డైలాగులకు మట్టి పరిమళాలు అద్దుతున్నారు.
వేషంలోనే కాదు భాషలోనూ స్థానికతను పులుముకొని ప్రేక్షకులను రంజింపజేస్తున్నారు.

యాసే శ్వాసగా టాలీవుడ్ హీరోల జోరు

సినిమా కథ ఎంత స్థానికంగా ఉంటే.. ప్రేక్షకుల మనసుకు అంతగా చేరుకుంటుంది అనడానికి ఇటీవల వచ్చిన చిత్రాలే నిదర్శనం. ప్రాంతీయ యాస, స్థానిక సంస్కృతిని తెరపై ఆవిష్కరించడం ద్వారా కొత్త అనుభూతి పంచే సినిమాలు వరుస విజయాలు సాధిస్తున్నాయి. గతంలో తెలుగు చిత్రాల్లో ప్రామాణిక భాషకే ప్రాధాన్యం ఉండేది. మాండలికాలు హాస్య పాత్రలకు, విలన్లకు పరిమితం చేసి అపహాస్యం చేసిన దాఖలాలు కోకొల్లలు. 'పాతాళభైరవి'లో నేపాల మాంత్రికుడు చెప్పినట్టు.. 'జనం అడిగింది మనం చేయవలె..' అని సినీజనాలూ ఫిక్సయినట్టున్నారు. అందుకే ట్రెండ్ మార్చేసి కొన్నేళ్లుగా హీరోల నోట కూడా మాండలికం పలికిస్తున్నారు. ప్రేక్షకులకు వినోదాన్ని పంచడంతో పాటు హీరోయిజానికి కొత్త సొగసులు అద్దుతున్నారు.

మనోళ్లంతా పక్కా లోకల్!!

'ఆర్ఆర్ఆర్'లో ఎన్టీయార్ తెలంగాణ యాసలో అదరగొట్టాడు. ఇచ్చిన పాత్రను అంతెత్తున నిలబెట్టే హీరోల్లో జూనియర్ నెంబర్ 1. భీం పాత్రలో తెలంగాణ భాషను హీరోచితంగా పలికించడంలోనూ ఎన్టీయార్ సక్సెస్ అయ్యాడు. ఇక 'వాల్తేరు వీరయ్య'లో రవితేజ తెలంగాణ మాండలికంతో మెప్పించాడు. ఆ సినిమాలో ఒకవైపు చిరంజీవి ఉత్తరాంధ్ర మాండలికంలో 'అట్టాంటోడు నా పేట్లో ఉన్నాడంటే నేనే ఒగ్గా.. వాడి తల నరికేసి డేక్సాలో అట్టుకొచ్చెయ్ గలను!' అంటూ ఇరగదీశాడు. మరోవైపు రవితేజ 'ఏమ్ రా వారీ పిస పిస చేస్తున్నవ్' అని నైజాం నైజాన్ని వినిపించాడు. ఇక బాలకృష్ణ 'ఈ సినిమా షానా ఏండ్లు యాదుంటది' అంటూ 'భగవంత్ కేసరి'లో కుమ్మేశాడు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో బాలయ్య బాడీ లాంగ్వేజ్‌కు తెలంగాణ యాస ఎంత పర్‌ఫెక్ట్‌గా సూటవుతుందో రుచి చూపించాడు. 'దసరా' చిత్రంలో నాని, కీర్తి సురేశ్ తెలంగాణ యాసలో మాట్లాడి, ప్రేక్షకులతో శభాష్ అనిపించుకున్నారు. 'సోగ్గాడే చిన్నినాయన', 'బంగార్రాజు', 'నా సామిరంగా' చిత్రాల్లో నాగార్జున కోనసీమ యాసలో అదరగొట్టాడు. ఇప్పుడు తెలుగు సినిమాల్లో తెలంగాణ యాస తర్వాత డిమాండ్ ఉన్నది చిత్తూరు మాండలికానికే! ఎప్పుడో ఏడేళ్ల క్రితం తీసిన 'అరవింద సమేత'లో ఎన్టీయార్ పలికిన డైలాగులు గుర్తుండే ఉంటాయి. 'ఒక మగాడు ఇంకొక మగాడ్ని చెరిస్తే యట్టుంటాదో చూపిస్తాను..' అంటూ గంభీరంగా చెప్పి చిత్తూరు మాండలికానికి టార్చ్ బేరర్‌లా నిలిచిపోయాడు. పుష్ప సిరీస్‌లో అల్లు అర్జున్ చిత్తూరు యాసలో మాట్లాడి మెప్పించడమే కాదు.. ఆ యాసకు బ్రాండ్ అంబాసిడర్‌లా మారిపోయాడు. 'పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా.. ఫైరు!', 'తగ్గేదే లే' లాంటి డైలాగులు పపంచకాన్నే ఊపేశాయి.

> ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాకే.. సినిమాల్లో తెలంగాణ భాష ప్రాధాన్యం పెరిగింది. అంతకు ముందు వచ్చిన కొన్ని చిత్రాల్లో తెలంగాణ నేపథ్యం అరకొరగా కనిపించేది. తెలంగాణ వచ్చాక.. ఇక్కడి ప్రజల జీవనశైలి, సంస్కృతిని ప్రతిబింబించే కథలకు ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టారు. ఫీల్ గుడ్ సినిమాల స్పెషలిస్ట్‌గా పేరున్న శేఖర్ కమ్ముల 'ఫిదా' చిత్రంలో తెలంగాణ గ్రామీణ అందాలను పరిచయం చేశాడు. అక్కడి కుటుంబ వ్యవస్థ, సంప్రదాయాలను హైలైట్ చేశాడు. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా 2021లో వచ్చిన 'లవ్‌స్టోరీ'లోనూ తెలంగాణ మాండలికం వినసొంపుగా అలరించింది.

తెలంగాణ హవా!

ఒకప్పుడు హాస్య పాత్రలకు లేదా ప్రతినాయక పాత్రలకే పరిమితం అయిన తెలంగాణ యాస ప్రస్తుతం టాలీవుడ్‌లో హవా కొనసాగిస్తున్నది! మొన్నటి 'మల్లేశం', నిన్నటి 'బలగం' సినిమాలు పూర్తిగా తెలంగాణ నేపథ్యంలో రూపొంది ప్రేక్షకుల మనసులు దోచుకున్నాయి. తెలంగాణ మాండలికం మాత్రమే కాదు... జీవనశైలిని నమ్ముకొని కూడా చిత్రాలు నిర్మించి సక్సెస్ సాధిస్తున్నారు సినీ నిర్దేశకులు. విజయ్ దేవరకొండ, విశ్వక్‌సేన్, సిద్ధు జొన్నలగడ్డ తెలంగాణ యాసలో మాట్లాడుతుంటే... ప్రాంతాలకు అతీతంగా ప్రేక్షకులు తెగ సంబురపడిపోతున్నారు. 'పెళ్లిచూపులు', 'అర్జున్ రెడ్డి' సినిమాల్లో విజయ్ దేవరకొండ తెలంగాణ స్లాంగ్‌లో డైలాగులు చెప్పి ఇండస్ట్రీలో సెటిలయ్యాడు. 'మల్లేశం'తో ప్రియదర్శి, 'డీజే టిల్లు'తో సిద్ధు ప్రేక్షకుల మెప్పు పొందారు. సాయిపల్లవి, నాగచైతన్య కలిసి నటించిన 'లవ్‌స్టోరీ' సినిమాలోనూ తెలంగాణం పల్లవించింది. ఇలా తెలంగాణ యాసను నమ్ముకుని అమ్ముకున్న సినిమాలు బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లు సాధించాయి. ప్రేక్షకుల మనసులకు దగ్గరైన భాషలో మాట్లాడితే.. పెట్టుబడికి తిరుగుండదని ఎన్నో సినిమాలు రుజువు చేశాయి.

జానపదాల జోరు

ప్రాంతీయతను సినీ ప్రేమికులకు చేరువ చేయడంలో జానపద గీతాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. 'సారంగదరియా' నుంచి 'పల్సర్ బైకు', 'చమ్కీల అంగీలేసి' లాంటి పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. 'బలగం' లాంటి కథలు మన జీవితానికి ఎంతో దగ్గరగా ఉండటంతో, వాటికి ప్రేక్షకాదరణ పెరుగుతున్నది. ఇది బాలీవుడ్‌ను కూడా ప్రభావితం చేసింది. తాజాగా వచ్చిన 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్' చిత్రంలో 'బతుకమ్మ' పాటను జోడించడమే ఇందుకు నిదర్శనం. లోకల్‌ను నమ్ముకున్న తెలుగు సినిమాలు గ్లోబల్ విజయాలు సాధిస్తున్నాయని చెప్పొచ్చు.

అమ్మాయిలూ.. అజాగ్రత్త వద్దు!

Mrunal Thakur

డ్రైవింగ్ చేసేటప్పుడు అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలని అంటున్నదని అందాల తార మృణాల్ ఠాకూర్. వాహనాలు నడిపేటప్పుడు హెయిర్ క్లచ్‌లు ధరించొద్దని సలహా ఇస్తున్నది. తెలుగులో మంచి పాపులారిటీ సంపాదించుకున్న మృణాల్.. సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్‌గా ఉంటుంది. పరిశ్రమతో పాటు పర్సనల్ విషయాలనూ అభిమానులతో పంచుకుంటుంది. తాజాగా, రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ.. ఓ వీడియోను సోషల్ మీడియా ద్వారా పంచుకున్నది. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇందులో అమ్మాయిలు జుట్టు ముడి వేసుకోవడానికి వాడే హెయిర్ క్లిప్.. డ్రైవింగ్ సమయంలో ఎలా ప్రమాదం తెచ్చిపెడుతుందో చూపించింది. ఈ క్లిప్ వెనుక సీట్‌కి తగిలి తలలోకి చొచ్చుకుపోయే ప్రమాదం ఉన్నదనీ, కాబట్టి కారు నడిపేటప్పుడు ఇలాంటివి ధరించవద్దని కోరింది. 'చిన్నచిన్న యాక్సరీలే పెద్ద అసౌకర్యాన్ని కలిగిస్తాయి. కారు ప్రమాదం జరిగినప్పుడు మరింత నష్టం చేస్తాయి. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకొని.. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఇలాంటివి ఉపయోగించకుండా ఉండటమే మంచిది' అంటూ చెప్పుకొచ్చింది. మృణాల్ పెట్టిన పోస్ట్‌కు నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తున్నది. హిందీ సీరియల్స్‌లో మెరిసిన మృణాల్ ఠాకూర్.. హనూ రాఘవపూడి దర్శకత్వంలో వచ్చిన 'సీతారామం'తో టాలీవుడ్‌కు పరిచయమైంది. ఒక్క సినిమాతోనే ఓవర్‌నైట్ స్టార్‌గా మారిపోయింది. అన్ని భాషల్లోనూ ఆఫర్లు అందుకుంటూ.. టాప్ హీరోయిన్‌గా దూసుకుపోతున్నది. ప్రస్తుతం తెలుగులో అడివి శేష్ నటిస్తున్న 'డెకాయిట్'లో హీరోయిన్‌గా నటిస్తున్నది. బాలీవుడ్‌లోనూ సన్ ఆఫ్ సర్దార్ 2, సిద్ధాంత్ చతుర్వేది చిత్రం సహా పలు క్రేజీ ప్రాజెక్టులతో మృణాల్ ఠాకూర్ బిజీగా ఉన్నది!

ప్రేమ + స్నేహం.. సమ్మేళనం

ఓటీటీ హిట్

ఈటీవీ విన్ : ఫిబ్రవరి 20
తారాగణం : ప్రియా వడ్లమాని, గణాదిత్య, విజ్ఞయ్ అభిషేక్, బిందు నూతక్కి, శివనాథ్ యాచమనేని, శ్రీకాంత్ గుర్రం, జీవన్ ప్రియా రెడ్డి తదితరులు
దర్శకత్వం : తరుణ్ మహాదేవ్

ముక్కోణపు ప్రేమ కథలు భిన్నంగా సాగుతాయి. ఒకే అమ్మాయిని ఇద్దరు ప్రేమించడం.. ఒక్కరినే ఇద్దరు అమ్మాయిలు ప్రేమించడం.. ఈ కాన్సెప్ట్‌తో ఇప్పటికే ఎన్నో సినిమాలు వచ్చాయి. ప్రేమదేశం.. బద్రి.. క్రిమినల్.. ఆర్య లాంటివి బ్లాక్‌బస్టర్ లిస్ట్‌లో చేరాయి. ఇక ఈ ట్రయాంగిల్ లవ్ ట్రాక్‌కు స్నేహం కూడా ముడిపడితే.. అదే 'సమ్మేళనం'. ఈటీవీ విన్ వేదికగా, ఆరు ఎపిసోడ్లుగా వచ్చిన ఈ తెలుగు వెబ్ సిరీస్.. ప్రేక్షకుల ఆదరణతో హిట్ టాక్ సొంతం చేసుకున్నది. కథ విషయానికి వస్తే.. రామచంద్ర అలియాస్ రామ్ (గణాదిత్య) రచయిత. తన స్వీయ అనుభవాలకు అక్షరరూపం ఇస్తూ.. ఓ పుస్తకం రాస్తాడు. దానికి మంచి స్పందన రావడంతో.. అతని ఫొటోతోపాటు పుస్తకం గురించి కొన్ని సంగతులు ఓ న్యూస్ పేపర్లో ప్రచురితమవుతాయి. ఆ ఆర్టికల్‌ను చూసి.. రామ్‌ను వెతుక్కుంటూ శ్రేయ (బిందు నూతక్కి), రాహుల్ (శ్రీకాంత్ యాచమనేని), అర్జున్ (విజ్ఞయ్ అభిషేక్), మేఘన (ప్రియా వడ్లమాని) వస్తారు. వీరంతా కొన్నాళ్ల క్రితం విడిపోయిన స్నేహితులు. ఇక.. అర్జున్, రామ్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. పెద్ద రచయిత కావాలనే లక్ష్యంతో ఉంటాడు రామ్. అందుకు అర్జున్ కూడా సపోర్ట్ చేస్తుంటాడు. ఆర్థికంగా ఆదుకుంటూ ఉంటాడు. ఇలా ఉండగా.. తన ఆఫీసులో పరిచయమైన మేఘనతో అర్జున్ ప్రేమలో పడతాడు. ఆ అమ్మాయినే రామ్ కూడా ప్రేమిస్తాడు. మరి.. మేఘన ఎవరిని ప్రేమించింది? ఆమె గతమేంటి? ఆమె జీవితంలో చార్లీ (శ్రీకాంత్ గుర్రం) పాత్ర ఏమిటి? 'విలన్' లేని ఈ ముక్కోణపు ప్రేమ కథలో.. ఒకరికొకరు ఎలా దూరం అయ్యారు? మళ్లీ ఎలా కలిశారు? చివరికి ఎవరెవరు ఒక్కటయ్యారు? అనేది తెలవాలంటే.. సిరీస్ చూడాల్సిందే!